# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




ముంబైలో ఇద్దరు టెర్రరిస్టులను అరెస్టు చేసిన పంజాబ్ పోలీసులు


ప్రచురణ : జగిత్యాల   సంపుటి : 05   సంచిక : 166   పేజీలు : 04   వెల రూ. 2   మంగళవారం   16 - 12 - 2025


# తుది దశ పోరుకు సిద్ధం!

- మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం బంద్
- ఈ నెల 17 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్
- ఈ విడతలో మొత్తం 182 మండలాల్లోని 3 752 గ్రామ పంచాయతీలు ఎన్నికలు
- మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 12,640 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీ
- 11 గ్రామాలకు,112 వార్డులకు వివిధ కారణాల వల్ల ఎన్నికలు జరగడం లేదు
- ఈ నెల 17 సాయంత్రం వరకు ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులకు బంద్




తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడత ప్రచారం గడువు ముగిసింది. ప్రచార డప్పులు మోగడం ఆగిపోవడంతో, ఇప్పుడు అభ్యర్థులు, కార్యకర్తలు పోలింగ్ రోజు కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నెల 17 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మూడో విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనుంది. ఈ విడతలో - మిగతా 2 లో

## 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం



- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- జాగృతిని రాజకీయ పార్టీగా మార్చే దిశగా సంకేతాలు
- గ్రామస్థాయిలో జాగృతి కమిటీలు ఏర్పాటు చేస్తామన్న కవిత
- కొత్త పార్టీ పేరుపై నెటిజన్ ప్రశ్నకు ఆసక్తికర సమాధానం

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేశారు. 2029లో జరిగే ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా ఆమె నెటిజన్లతో 'ఆస్క్ కవిత' పేరుతో క్వశ్చన్ అవర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా సమాధానాలిచ్చారు.ఈ సందర్భంగా ఓ నెటిజన్.. "మీ కొత్త పార్టీ పేరు ఏంటి?" అని ప్రశ్నించగా, "ఎలా ఉండాలో మీరే చెప్పండి" అంటూ కవిత సమాధానమిచ్చారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో - మిగతా 2 లో

## అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వం



- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్, సీఈ వెంకట రమణారెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి
- అంగుళం భూమి అన్యాక్రాంతం కాకుండా తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యలపై సమావేశం
- భూముల లీజు, అగ్రిమెంట్లు, కోర్టు కేసులు, అద్దెలు తదితర అంశాలపై ఈ సమావేశంలో సుధీర్ఘంగా చర్చ

హౌసింగ్ బోర్డు భూములు పరిరక్షణకు, అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యలపై సచివాలయంలో హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్, సీఈ వెంకట రమణారెడ్డి అధికారులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమావేశం నిర్వహించారు.హౌసింగ్ బోర్డు భూముల లీజు, అగ్రిమెంట్లు, కోర్టు కేసులు, - మిగతా 2 లో

# చైనా పార్టులు వద్దు..

- రూ.5,000 కోట్లతో స్వదేశీ డ్రోన్ల కొనుగోలుకు ఆర్మీ సిద్ధం
- భారీగా దేశీయ డ్రోన్లను సమకూర్చుకోనున్న సైన్యం
- కామికేజ్, నిఘా, సుదూర లక్ష్యం ఛేదన డ్రోన్ల సమీకరణ
- జామింగ్, స్పూఫింగ్‌ను తట్టుకునేలా ప్రత్యేక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యం




## భోగాపురంలో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుసిటీ

- ప్రాజెక్టుకు మంత్రి లోకేశ్ చేతుల మీదుగా శ్రీకారం
- విమానయాన, రక్షణ రంగాల్లో నైపుణ్యాల కొరత తీర్చడమే లక్ష్యం
- 160 ఎకరాల్లో జీఎంఆర్ మాన్సాస్ ఆధ్వర్యంలో నిర్మాణం
- అంతర్జాతీయ వర్సిటీలతో విద్యా, ఆవిష్కరణల హబ్‌గా రూపకల్పన




ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలి ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్ ఎడ్యుకేషన్ సిటీని విజయనగరం జిల్లా భోగాపురంలో ఏర్పాటు చేయనుంది. 'జీఎంఆర్ మాన్సాస్ ఎడ్యుసిటీ' పేరుతో రానున్న ఈ ప్రాజెక్టును రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రేపు విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో లాంఛనంగా ప్రారంభించనున్నారు.దేశంలో విమానయానం, ఏరోస్పేస్, రక్షణ రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ రంగాల మార్కెట్ విలువ 2034 నాటికి 57 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. అయితే, ఈ వేగానికి తగ్గట్టుగా - మిగతా 2 లో

## బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు

- జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరు
- బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు
- కార్యకర్తల కష్టమే పార్టీ విజయాలకు కారణమని వెల్లడి
- జేపీ నడ్డా పదవీకాలం ముగియడంతో ఈ కీలక మార్పు
- రాష్ట్రాల్లో కాకుండా జాతీయస్థాయిలో ఇలాంటి నియామకం ఇది రెండోసారి
- 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తేవడంలో కీలకపాత్ర పోషించారు




బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. పట్నా నుంచి ఢిల్లీ చేరుకున్న నితిన్ నబీకి ఢిల్లీ విమానాశ్రయంలో సీఎం రేఖా గుప్తా స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్న నితిన్ నబీ, - మిగతా 2 లో

## జోర్డాన్ రాజధానిలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం




- ప్రధాని మోదీకి జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో భారతీయ సంతతి నుంచి అపూర్వ స్వాగతం
- భారతీయ సంతతి భారత్-జోర్డాన్ సంబంధాలకు గణనీయమైన కృషి
- భారత్-జోర్డాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ జోర్డాన్ సందర్శన

# ఏపీ ప్రాజెక్టులకు కేంద్రం అండ

- మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో లోకేశ్ కీలక భేటీ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ
- రాష్ట్రవ్యాప్త నైపుణ్య గణనకు సహకరించాలని విజ్ఞప్తి
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు మద్దతు కోరిన లోకేశ్
- ఏపీలో ఏఐ మిషన్ వేగవంతానికి సాయంపై కీలక చర్చ
- లోకేశ్ వినతులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి



రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో చేపట్టనున్న పలు కీలక ఐటీ, నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. లోకేశ్ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.ఈ సమావేశంలో రాష్ట్రంలో చేపట్టనున్న నైపుణ్య - మిగతా 2 లో

# వైజాగ్‌కు వరల్డ్ ఛాంపియన్లు వస్తున్నారు

- మంత్రి నారా లోకేశ్ పోస్టుతో సర్వత్రా ఆసక్తి
- మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర సోషల్ మీడియా పోస్ట్
- ఈ నెలలో వైజాగ్‌కు ప్రపంచ ఛాంపియన్లు వస్తున్నారంటూ వెల్లడి
- ఎవరో ఊహించగలరా అంటూ నెటిజన్లకు సవాల్
- లోకేశ్ పోస్ట్‌తో సర్వత్రా ఉత్కంఠ, ఊహాగానాలు



ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, త్వరలో విశాఖపట్నానికి ప్రపంచ ఛాంపియన్లు రాబోతున్నారని వెల్లడించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా వైజాగ్ ప్రజల్లో తీవ్ర కుతూహలం నెలకొంది."వైజాగ్... సిద్ధంగా ఉండు. ఈ నెలలోనే ప్రపంచ ఛాంపియన్లు వస్తున్నారు. వారెవరో ఎవరైనా ఊహించగలరా?" అంటూ లోకేశ్ తన - మిగతా 2 లో

# సంపాదకీయం

## ట్రంప్ 'శాంతి'కి గ్రహణం

ఎనిమిది యుద్ధాలను ఆపానని స్వోత్కర్షకు పోతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పరువు తీసేలా ప్రపంచంలో రెండుచోట్ల మళ్లీ కుంపట్లు రాజుకున్నాయి. సుంకాలు విధిస్తానంటూ బెదిరించి రెండునెలల క్రితం ఆయన ఆగ్నేయాసియా దేశాలైన థాయ్‌లాండ్ - కంబోడియాల మధ్య సాగుతున్న యుద్ధాన్ని ఆపి సఖ్యత కుదిర్చారు.ఆ రెండింటి మధ్యా సరిహద్దు సమస్యకు శాంతియుత పరిష్కారం కుదిరిందని ఆర్భాటంగా ప్రకటించారు. తీరా అయిదురోజుల నాడు కంబోడియా మందుపాతరకు తమ సైనికుడు తీవ్రంగా గాయపడటంతో థాయ్ వైమానిక దళం దాడులు ప్రారంభించింది. ఈసారి దాదాపు పదిమంది మరణించగా వేలాదిమంది జనం ప్రాణభయంతో గ్రామాలు విడిచి పెట్టి వెళ్లిపోవాల్సి వచ్చింది.కంబోడియా సైన్యం ప్రతీకార దాడులతో థాయ్ గ్రామాల ప్రజలు కూడా ఖాళీ చేయాల్సి వచ్చింది. మొత్తానికి అటూ, ఇటూ 5 లక్షలమంది నిరాశ్ర యులయ్యారు. ఆఫ్రికాలో పరస్పరం తలపడుతున్న కాంగో - రువాండాల మధ్య కేవలం వారం క్రితం ట్రంప్ శాంతి ఒప్పందం కుదిర్చారు. కానీ అది కూడా విఫలమైంది. పర్యవ సానంగా కాంగోలోని సరిహద్దు గ్రామాలను 2 లక్షల మంది ఖాళీ చేయాల్సి వచ్చింది. రువాండా తిరుగుబాటు సంస్థ ఆ గ్రామాల్లోకి ప్రవేశించిందంటున్నారు.సమస్య మూలమేమిటో తెలుసుకోకుండా, ఇరుపక్షాలూ ఎలాంటి పరిష్కారాన్ని కోరుకుంటున్నాయో గ్రహించకుండా, అందుకు ఏర్పడుతున్న అడ్డంకులేమిటో అర్థం చేసుకోకుండా... ఒక ఫోన్ కాల్‌తో, ఒకటి రెండు బెదిరింపులతో అంతా సమసిపోతుంద నుకుంటే అవి మళ్లీ మళ్లీ తలెత్తుతూనే ఉంటాయి. ట్రంప్ దౌత్యం విఫలం కావటానికి కారణం ఇదే.ఇరుగు పొరుగు దేశాల మధ్య భూభాగం గురించే ప్రధానంగా ఘర్షణలుంటాయి. థాయ్‌లాండ్ - కంబోడియాల సమస్య కూడా అదే! రెండు దేశాలకూ 817 కిలోమీటర్ల పొడవునా సరిహద్దు ఉంది. ఫ్రాన్స్ దురాక్రమణలో కంబోడియా ఉండగానే వందేళ్ల క్రితం థాయ్‌లాండ్‌తో పేచీ ఏర్పడింది. 1953లో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దాన్ని పరిష్కరించుకుందామని కంబోడియా ప్రయత్నిస్తోంది.కానీ రెండువైపులా పుట్టు కొచ్చే జాతీయవాద ధోరణులు అందుకు అడ్డంకిగా మారాయి. 2008లో వివాదాస్పద భూభాగంలోని 11వ శతాబ్దం నాటి హిందూ దేవాలయాన్ని యునెస్కో ప్రపంచ వార సత్వ సంపదల జాబితాలో చేర్చినప్పుడు అది తమదేనని కంబోడియా ప్రకటించు కోవటంతో ఘర్షణలు తలెత్తాయి. వాస్తవానికి 1962లోనే ఆ భూభాగం కంబోడియా దేనని అంతర్జాతీయ న్యాయస్థానం ప్రకటించింది. కానీ అందుకు థాయ్ లాండ్ ససేమిరా అంటున్నది.మొన్న జూలైలో ఇరువైపులా 50 మంది మరణానికి దారితీసిన ఘర్షణలు రాజు కున్నప్పుడు అప్పటి థాయ్ ప్రధాని పెటోంగ్‌టార్న్ షినవత్రా, కంబోడియా మాజీ ప్రధాని హున్ సేన్‌తో జరిపిన ఫోన్ సంభాషణలు లీక్ అయ్యి ఆమె పదవి పోగొట్టు కున్నారు. తమ సైన్యం కూడా సరిగా వ్యవహరించటం లేదని ఆమె అంగీకరించటం దేశంలో పెద్ద దుమారం లేపింది. నాలుగు దశాబ్దాలు దేశాన్నేలిన హున్ సేన్ ఇప్పటికీ ప్రస్తుత ప్రధాని, తన కుమారుడు హున్ మానెట్‌ను తెర వెనక ఉండి నడిపిస్తుంటారు. ఆయనతో మాట్లా డితే తప్ప సమస్య పరిష్కారం కాదని షినవత్రా అనుకోవటం కొంప ముంచింది. తాజా వివాదం పర్యవసానంగా కంబోడియా పౌరులను దేశంలోకి రానీయ కుండా థాయ్‌లాండ్ సరిహద్దుల వద్ద అడ్డుకుంటుండగా, థాయ్ సినిమాల ప్రసారం, అక్కడి పండ్లు, కూరగాయలు, గ్యాస్, ఇంధనం రాకుండా కంబోడియా నిలిపేసింది.థాయ్ - కంబోడియా ఘర్షణలైనా, కాంగో - రువాండాల కొట్లాట అయినా ప్రత్యర్థి దేశాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించినప్పుడే పరిష్కారమవుతాయి. దాదాపు అన్ని దేశాల్లోనూ అధికారం కోసం జాతీయవాద ధోరణులు రెచ్చగొట్టడం వల్ల సమస్య లొచ్చిపడుతున్నాయి. థాయ్‌లాండ్‌లో వచ్చే ఫిబ్రవరి 6న ఎన్నికలు జరగబోతున్నాయి.గతంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, దేశాన్ని రక్షించేది తామేనని చెప్పటానికి కంబో డియాపై యుద్ధభేరి మోగించటంతో పాటు పాలకపక్షం శుక్రవారం పార్లమెంటును రద్దు చేసింది. మళ్లీ ఇరుపక్షాల మధ్యా రాజీ కుదురుస్తానని ట్రంప్ చెబుతున్నా ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

## వైజాగ్‌కు వరల్డ్ ఛాంపియన్లు వస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి** – సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ చిన్న పోస్ట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. వస్తున్నది క్రీడా రంగానికి చెందినవారా, లేక టెక్నాలజీ లేదా వ్యాపార రంగంలోని దిగ్గజాలా అనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి వెల్లడించే లోకేశ్, ఇలా సస్పెన్స్ క్రియేట్ చేస్తూ పోస్ట్ పెట్టడంతో అందరిలోనూ ఆసక్తి పెరిగింది. విశాఖను అంతర్జాతీయంగా మరింత ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకే ఈ కార్యక్రమం అని పలువురు భావిస్తున్నారు. ఆ ప్రపంచ ఛాంపియన్లు ఎవరు, వారు ఏ రంగంలో నిష్ణాతులు అనే వివరాలు తెలియాలంటే మంత్రి నుంచి రాబోయే అధికారిక ప్రకటన వరకు వేచి చూడాల్సిందే.

## భోగాపురంలో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుసిటీ

**మొదటిపేజీ తరువాయి** – నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో లేవు. దేశం ప్రస్తుతం పైలట్లు (12–15%), ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్లు, భద్రతా నిపుణుల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటోంది. ఏటా కేవలం 8 వేల మంది ఏరోస్పేస్ ఇంజనీర్లు మాత్రమే పట్టభద్రులవుతున్నారు. ఇది మొత్తం ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో 0.5 శాతమే కావడం గమనార్హం. ఈ నైపుణ్యాల కొరతను అధిగమించే లక్ష్యంతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 160 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఎడ్యుసిటీని నిర్మించనున్నారు. ఇది ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు అంకితమైన దేశంలోని మొట్టమొదటి సమీకృత విద్యా, ఆవిష్కరణల కేంద్రంగా (ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్నోవేషన్ హబ్) నిలవనుంది. ఇందులో ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీల బ్రాంచ్ క్యాంపస్‌లు, పరిశోధన కేంద్రాలు, స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు.మేకిన్ ఇండియా, జాతీయ విద్యా విధానం వంటి లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దనున్నారు. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు యావత్ భారతదేశాన్ని ఏవియేషన్, ఏరోస్పేస్ విద్య, ఆవిష్కరణలలో ప్రపంచస్థాయి లీడర్ గా నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

## ఏపీ ప్రాజెక్టులకు కేంద్రం అండ

**మొదటిపేజీ తరువాయి** – గణన కోసం ఏఐ టెక్నాలజీతో రూపొందించిన 'నైపుణ్యం పోర్టల్' గురించి లోకేశ్ కేంద్ర మంత్రికి వివరించారు. ఇప్పటికే మంగళగిరిలో పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించామని, ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ విధానాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే ఈ బృహత్ కార్యక్రమానికి కేంద్రం సహాయం అందించాలని కోరారు.అలాగే రాష్ట్రంలోని యువ పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు కేంద్రం అండగా నిలవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఐటీ శాఖ పరిధిలోని '%వీవక్%స్టార్టప్ హబ్' ద్వారా మద్దతు అందించాలని కోరారు. ఇదే హబ్‌లో యానిమేషన్, ఏఆర్/వీఆర్ వంటి అత్యాధునిక టెక్నాలజీస్ కోసం ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కూడా సహకరించాలని విన్నవించారు.ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలో కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణను వేగవంతం చేసేందుకు మద్దతివ్వాలని కోరారు. ఈ భేటీలో లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలు కూడా ఉన్నారు.ం

## 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం



**మొదటిపేజీ తరువాయి** – ఆసక్తిని రేకెత్తించాయి. త్వరలోనే జాగృతి సంస్థ కార్యకలాపాలను గ్రామస్థాయి వరకు విస్తరిస్తామని, ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. జాగృతి సంస్థ ద్వారానే ఎన్నికల బరిలో నిలవబోతున్నట్లు పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. 2047 నాటికి దేశ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడమే తన జీవిత లక్ష్యమని కవిత పునరుద్ఘాటించారు. ఇదే తన విజన్, మిషన్ అని ఆమె పేర్కొన్నారు. కవిత తాజా ప్రకటనతో ఆమె భవిష్యత్ రాజకీయ ప్రణాళికలపై చర్చ మొదలైంది.

# బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్ సిన్హా బాధ్యతలు

**మొదటిపేజీ తరువాయి** – డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ విగ్రహాల వద్ద పుష్పాలు ఉంచి నివాళు లర్పించారు. తర్వాత నితిన్ నబీని కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అమిత్ షా స్వయంగా తొడ్కొని వెళ్లి కుర్చీలో కూర్చొబెట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పుష్పాలు అందించిన కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు బిహార్‌కు చెందిన 45 ఏళ్ల నితిన్ నబీన్ సిన్హాను పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించినట్లు బీజేపీ ప్రకటించింది. ఈ మేరకు పార్లమెంటరీ బోర్డు నిర్ణయించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటించారు. రాష్ట్రాల్లో కాకుండా జాతీయస్థాయిలో ఇలాంటి నియామకం ఇది రెండోసారి. గతంలో నడ్డా కూడా ఇలాంటి పదవిలోకి మొదట వచ్చారు. ప్రస్తుతం జాతీయ అధ్యక్షుడిగా ఆయన పదవీకాలం ఇప్పటికే ముగియగా పొడిగింపులో ఉన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బిహార్ సరిహద్దుల్లోని బంగాల్ ప్రాంతంలో ప్రభావం చూపే ఉద్దేశంతో ఇప్పుడు సిన్హాను అనూహ్యంగా తెరమీదికి తెచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే జనవరి 14 తర్వాత సిన్హాను లాంఛనంగా పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకొనున్నట్లు తెలుస్తోంది. దీంతో చిన్నవయసులోనే పార్టీ పగ్గాలు చేపట్టినవారిలో ఒకరిగా,





బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలినేతగా ఆయన రికార్డ్ సృష్టించనున్నారు. కాగా, ఏప్రిల్‌లో జరగబోయే పార్టీ జాతీయ మండలి సమావేశం ఆయన ఎన్నికను ధ్రువీకరించనుంది.

**ఓటమి తెలియని నాయకుడు**

బిహార్‌లోని కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. ఇటీవలి ఎన్నికల్లో బిహార్‌లోని బాంకీపుర్ నుంచి ఐదోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రముఖ సినీనటుడు శత్రుఘ్నసిన్హా కుమారుడు లవ్‌సిన్హాపై 84వేల ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. అంతకుముందు పార్టీ యువమోర్చా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఛత్తీస్‌గఢ్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా పనిచేసి అక్కడ బీజేపీని అధికారంలోకి తేవడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన తండ్రి నబీన్‌కిశోర్ ప్రసాద్ సిన్హా బిహార్ బీజేపీలో పెద్దనేతగా గుర్తింపు పొందారు. 2005లో తండ్రి ఆకస్మిక మరణంతో నితిన్ 26 ఏళ్ల వయసులో రాజకీయాల్లోకి ప్రవేశపెట్టారు. 2006లో జరిగిన ఉప ఎన్నికలో తొలిసారి గెలిచిన ఆయన ఆ తర్వాత, ఎన్నడూ ఓటమి చవిచూడలేదు. 1980 మే 23న రాంచీలో జన్మించిన నబీన్‌సిన్హా విద్యాభ్యాసం దిల్లీలో పూర్తయింది.

**బిహార్ బీజేపీ చీఫ్‌గా సంజయ్**

మరోవైపు బిహార్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సంజయ్ సరోగయ్?ను నియమించింది అధిష్ఠానం. తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని ఈ మేరకు జేపీ నడ్డా నియమించినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ వెల్లడించారు. గతంలో బిహార్ ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించిన ఆయన, ధర్భంగా నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

## చైనా పార్టులు వద్దు..



**మొదటిపేజీ తరువాయి** – భారత సైన్యం తన సామర్థ్యాన్ని మరింత పెంచుకునే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో, సుమారు రూ.5,000 కోట్ల విలువైన పూర్తి దేశీయ డ్రోన్ల కొనుగోలుకు ఆర్డర్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. శత్రు దేశాల నుంచి ఎదురయ్యే జామింగ్, స్పూఫింగ్ వంటి ఎలక్ట్రానిక్ యుద్ధ తంత్రాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ఈ డ్రోన్లను ప్రత్యేకంగా రూపొందించారు.గతంలో పాకిస్థాన్, ఉగ్రవాద సంస్థలపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎదురైన సవాళ్లను దృష్టిలో ఉంచుకుని సైన్యం ఈ డ్రోన్ల కోసం కఠినమైన పరీక్షలు నిర్వహించింది. అత్యవసర కొనుగోలు నిబంధనల కింద ఈ ప్రక్రియను చేపడుతుండగా, కేవలం దేశీయ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు మాత్రమే అవకాశం కల్పించారు. ముఖ్యంగా, ఈ డ్రోన్లలో చైనాకు చెందిన విడిభాగాలు ఏమాత్రం ఉండకూడదనే నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. ది ఎకనామిక్ టైమ్స్ కథనం ప్రకారం, సైన్యం మూడు రకాల అవసరాల కోసం ఈ డ్రోన్లను సమకూర్చుకోనుంది. వీటిలో తక్కువ దూరంలోని లక్ష్యాలను ఛేదించే కామికేజ్ లేదా లోయిటరింగ్ డ్రోన్లు, సుదూర లక్ష్యాలను గుర్తించి ధ్వంసం చేసి తిరిగి వెనక్కి రాగల ప్రెసిషన్ డ్రోన్లు, నిఘా కోసం ఉపయోగించే యూఏవీలు ఉన్నాయి.ఈ డ్రోన్ల ఎంపిక కోసం భారత సైన్యం ప్రత్యేకంగా ఒక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ టెస్టింగ్ జోన్‌ను ఏర్పాటు చేసింది. ప్రయోగం మొదలైనప్పటి నుంచే తీవ్రమైన జామింగ్ పరిస్థితులను సృష్టించి వాటి పనితీరును పరీక్షించింది. అలాగే, ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో కూడా ఇవి ఎంత సమర్థవంతంగా పనిచేస్తాయో పరిశీలించింది.ఈ పరీక్షల్లో ప్రభుత్వ రంగ సంస్థ అయిన మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, సుమారు రూ.500 కోట్ల విలువైన లోయిటరింగ్ మ్యూనిషన్స్ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ భారీ కొనుగోలుతో భవిష్యత్ యుద్ధాల్లో భారత సైన్యం నిఘా, దాడి సామర్థ్యాలు గణనీయంగా పెరగనున్నాయి.


## అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వం

**మొదటిపేజీ తరువాయి** – అద్దెలు తదితర అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఒకవైపు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటూనే మరో వైపు లీజు, కమర్షియల్, అద్దెలు, రెగ్యులరైజేషన్ తదితర అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.నిజాం కాలం నుంచి 115 సంస్థలకు హౌసింగ్ బోర్డు భూములను లీజుకు ఇవ్వడం జరిగింది, ఇందులో ప్రధానంగా ఇనిస్ట్యూషన్స్, రెసిడెన్షియల్, కమర్షియల్, స్కూల్స్, టెంపుల్స్ తదితరాలు ఉన్నాయి. ఏడు స్థలాలకు సంబంధించి కోర్టు కేసులు, అలాగే అద్దెబకాయిలు ఉన్నాయి. లీజు అగ్రిమెంట్ పునరుద్ధరణ చేసుకోని సంస్థలకు హౌసింగ్ బోర్డు తరపున లేఖలు రాసి వాటి రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఇవ్వాలని అధికారులకు సూచించారు. హౌసింగ్ బోర్డు నిబంధనల ప్రకారం ప్రతి షాపు యజమాని ప్రతి ఏడాది 10శాతం అద్దెను పెంచుతూ షాపును రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని అయితే ఈ నిబంధన అమలు కాకపోవడంతో షాపు యజమానుల



నుంచి హౌసింగ్ బోర్డుకు కోట్లాది రూపాయిలు రావలసి ఉందని ఈ సందర్భంగా అధికారులు తెలుపగా.. ప్రస్తుతం షాపులు నిర్వహిస్తున్నవారు ఆ షాపులను కొనుగోలు చేయడానికి ముందుకువస్తే మార్కెట్ ధర ప్రకారం విక్రయించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. అలాగే షాపు నిర్వహణకు అనువుగా లేకపోతే ఆ స్థలాన్నివేలంలో విక్రయించాలని చెప్పారు.కోర్టు కేసులలో ఉన్న భూములు హౌసింగ్ బోర్డుకు చెందేలా పటిష్టమైన వాదన వినిపించేలా ప్రత్యేకంగా అడ్వకేట్‌ను నియమించుకోవాలని, హౌసింగ్ బోర్డు గతంలో కేటాయించిన ఇండ్లకు పక్కనే ఉన్న వంద గజాల లోపు స్థలాలను ఆఇంటి యజమానికి ఆసక్తి ఉంటే విక్రయించాలని అలాగే గతంలో ఇంటి కోసం హౌసింగ్ బోర్డు కేటాయించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోనివారికి ఇప్పుడు రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించాలని, పక్కనే ఉన్న వంద గజాల లోపు స్థలాన్ని కూడా కొనుగోలు చేసుకుంటే మొత్తం స్థలానికి రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. మార్కెట్ ధర, సబ్ రిజిస్ట్రార్ మార్కెట్ కార్డు విలువ వంద గజాల లోపు స్థలాల వివరాలు, రిజిస్ట్రేషన్ కాని ప్లాట్ల వివరాలు, రిజిస్ట్రేషన్ చేసుకొని పక్కనే ఉన్న వంద గజాలలోపు స్థలాన్ని అడుగుతున్నవారి వివరాలు తదితర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక తయారుచేయాలని అధికారులకు సూచించడం జరిగింది.. వీటన్నింటిపై క్యాబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

## తుది దశ పోరుకు సిద్ధం!





**మొదటిపేజీ తరువాయి** – మొత్తం 182 మండలాల్లోని 3 752 గ్రామ పంచాయతీలు ఎన్నికల రంగంలోకి దిగుతున్నాయి.మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో 3,752 గ్రామ పంచాయతీలకు, 28,406 వార్డులకు 75,283 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ విడతలో 4,157 గ్రామాలకు, 36,434 వార్డులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. 394 గ్రామాలు,7916 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 3, 752 గ్రామ పంచాయతీల్లో 12,640 మంది సర్పంచ్ అభ్యర్థుల పోటీ పడుతున్నారు. కాగా, 11 గ్రామాలకు,112 వార్డులకు వివిధ కారణాల వల్ల ఎన్నికలు జరగడం లేదు.

**మద్యం దుకాణాలు బంద్..**

ఎన్నికల నిబంధనల ప్రకారం, ఇవాళ సాయంత్రం 6 గంటల నుంచి ఎల్లుండి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులకు బంద్ అమల్లోకి వచ్చింది. ఇక తుది విడత పోరుకు అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది సిద్దమయ్యారు. జిల్లాలోని మండల కేంద్రాల్లో ఇప్పటికే పోలింగ్ సామగ్రి చేరుకుంది. 16న ఉదయం 7 గంటల నుంచి డిస్ట్రిబ్యూషన్‌న్ సెంటర్ల వద్ద నుంచి సిబ్బంది ఎన్నికల సామగ్రిని తీసుకుని పోలీస్ బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ షురూ అవుతుంది.

## జోర్డాన్ రాజధానిలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం



**మొదటిపేజీ తరువాయి** – భారతీయ సంతతి భారత్–జోర్డాన్ సంబంధాలకు గణనీయమైన కృషి చేస్తున్నారని భారత ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రధాని మోదీకి జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో భారతీయ సంతతి నుంచి అపూర్వ స్వాగతం లభించింది.ఇవాళ మూడు దేశాల పర్యటనలో భాగంగా మొదటి జోర్డాన్‌కు చేరుకున్న ప్రధాని మోదీని హెూటల్ వద్ద జోర్డాన్ లోని భారత సంతతికి చెందిన వారు భారత జాతీయ జెండాను చేతబట్టి ప్రధాని మోదీకి నమస్కరించి స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని వారిని ప్రేమతో పలుకరించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ డిసెంబర్ 15 నుంచి 18 వరకు జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ మూడు దేశాల్లో పర్యటిస్తారు. ఈ పర్యటన ద్వారా ఆయా దేశాలతో పురాతన సంస్కృతిక సంబంధాలతో పాటు ఆధునిక ద్వైపాక్షిక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయాలన్నది ప్రధాని పర్యటన ప్రధాన లక్ష్యం.ప్రధాని మోదీ.. జోర్డాన్ సందర్శన భారత్–జోర్డాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతోంది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ.. జోర్డాన్ రాజు అబ్దుల్లా ఇబ్న్ అల్ హుస్సేన్, ఆ దేశ ప్రధాని జాఫర్ హసన్‌లతో భేటీ కానున్నారు. జోర్డాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఇథియోపియా, ఒమన్ దేశాల్లో పర్యటిస్తారు.

## ఎస్పీ బాలుకు అసలైన నివాళి అదే - మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్ రవీంద్రభారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం**
**కాంస్య విగ్రహావిష్కరణ**
**ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి**
**వెంకయ్యనాయుడు**
**బాలు కేవలం గాయకుడే కాదు,**
**బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడిన వైనం**

గాన గంధర్వుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు సోమవారం ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఎస్పీబీతో తనకున్న అనుబంధాన్ని, ఆయన గొప్పతనాన్ని స్మరించుకున్నారు. అశేష ప్రజల అభిమానాన్ని పొందిన గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు మాట్లాడుతూ, బాలసుబ్రహ్మణ్యం కేవలం స్వర సార్వభౌముడు మాత్రమే కాదని, ఆయన గొప్ప సంస్కారవంతుడని, నిరాడంబరుడని కొనియాడారు. ఆయన గాత్రంలో నవరసాలు నాట్యం చేసేవని, ఆయన ఆలపించిన ప్రతీ పాట భావ జలపాతమని అభివర్ణించారు. "సంగీత దర్శకులు, గేయ రచయితలు ఏది కోరుకుంటే అది పలికించే ఒక అక్షయపాత్ర ఆయన గళం. ఎంతో మంది నటుల నటనా శైలికి, వారి హావభావాలకు అనుగుణంగా గాత్రధర్మాన్ని మార్చుకుని పాడటం ఆయనకు మాత్రమే సాధ్యమైంది" అని ప్రశంసించారు.బాలు కేవలం గాయకుడిగానే కాకుండా, డబ్బింగ్ కళాకారుడిగా, నటుడిగా, మార్గదర్శిగా తన బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారని వెంకయ్య నాయుడు గుర్తుచేశారు. ఆయనలో ఒక గొప్ప వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఉన్నారని, 'పాడుతా తీయగా' వంటి కార్యక్రమాల్లో చిన్నారులను ఆయన ప్రోత్సహించిన తీరు అద్భుతమని కొనియాడారు. కేవలం సంగీత పాఠాలే కాకుండా, వారికి జీవిత సత్యాలను బోధిస్తూ, వారిలో సంస్కార బీజాలు నాటేందుకు ప్రయత్నించారని వివరించారు.చిన్నారులకు ఆయన చూపిన మార్గదర్శనం, పెద్దల పట్ల ఆయన చూపిన గౌరవం నేటి తరానికి ఆదర్శనీయమని వెంకయ్యానాయుడు అన్నారు. ఎస్పీబీ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాటల రూపంలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పేర్కొన్నారు. మన భాషా సంస్కృతులను పరిరక్షించుకోవడమే మనం ఎస్పీబీకి ఇచ్చే నిజమైన, సార్థకమైన



నివాళి అవుతుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# సికింద్రాబాద్ వైఎంసీఏ లో సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్స్

### ట్రాన్స్ జెండర్లపై వివక్ష తగదు
### ట్రాన్స్ జెండర్లు, సెక్స్ వర్కర్లు సమాజంలో ఒక భాగమని గుర్తించాలి




**సికింద్రాబాద్, డిసెంబర్ 15 (ప్రజామంటలు) :** సికింద్రాబాద్ వైఎంసీఏ లో ట్రాన్స్ జెండర్స్, దివ్యాంగులు, మెన్ సెక్స్ మెన్, వాణిజ్య లైంగిక కార్మికులతో కలిసి సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒకే వేదికపై విభిన్న వర్గాలు కలసి క్రిస్మస్‌ను జరుపుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది పాల్గొని క్రిస్మస్ ఆనందాన్ని పంచుకున్నారు.ఐ నీడ్ హెల్ప్ అనే ఎన్జీవో ట్రస్టీ జాకబ్ చిన్నప్ప ఆధ్వర్యంలో, వైఎంసీఏ సికింద్రాబాద్, యూపీఎఫ్ హైదరాబాద్ సహకారంతో ఈ వేడుకలు నిర్వహించారు. ప్రేమ, ఐక్యత, ఆశయాలను చాటిచెప్పేలా కార్యక్రమం సాగింది.క్రిస్మస్ సందేశాన్ని అందించిన జాయ్ చెరియన్ మాట్లాడుతూ, సమాజంలో నిర్లక్ష్యానికి గురవుతున్న వర్గాల పట్ల ప్రేమ, దయ చూపాల్సిన అవసరం ఉందన్నారు. క్రీస్తు త్యాగం అనంతమైన ప్రేమకు ప్రతీక అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై ప్రసంగించారు. విద్యావేత్త ఉ. శ్రావంతి ట్రాన్స్ జెండర్‌లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహకరిస్తానని తెలిపారు. మాజీ అదనపు డీజీపీ బాబు రావు బలహీన వర్గాలకు రక్షణ, మద్దతు అందిస్తామని భరోసా ఇచ్చారు. వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జయాకర్ డేనియల్ శిక్షణ, ఉపాధి, రుణ పథకాలను వైఎంసీఏ ద్వారా అమలు చేస్తామని ప్రకటించారు. వైఎంసీఏ సికింద్రాబాద్ ప్రధాన కార్యదర్శి లియోనార్డ్ సేవా కార్యక్రమాల పట్ల సంస్థ నిబద్ధతను స్పష్టం చేశారు. 'ఐ నీడ్ హెల్ప్' ట్రస్ట్ స్థాపకుడు జాకబ్ చిన్నప్ప రెండు దశాబ్దాలుగా అణగారిన వర్గాల అభ్యున్నతికి చేస్తున్న సేవలను వివరించారు. క్రిస్మస్ బహుమతుల పంపిణీ, లంచ్ భోజనంతో కార్యక్రమం ముగిసింది. సమాజంలోని అడ్డంకులను తొలగించి, సమానత్వం, అనురాగం, సమైక్యతకు ఈ వేడుక నిదర్శనంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

# రైల్వే లో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి

### 8వ వేతన సంఘ అమలు ప్రక్రియను వేగవంతం చేయాలి.
### రైళ్ళను ప్రైవేటీకరణ చేయవద్దు
### నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య



**సికింద్రాబాద్, డిసెంబర్ 15 ( ప్రజామంటలు) :** ఇండియన్ రైల్వేలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని నేషనల్‌ఫెడరేషన్‌ఆఫ్‌ఇండియన్‌రైల్వేమెన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్‌సంఘ్‌ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య డిమాండ్‌చేశారు. సికింద్రాబాద్‌చిలకలగూడలోని ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల జీతభత్యాల సవరణ కోసం ఏర్పాటు చేసిన 8వ వేతన సంఘం ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కనీస వేతనాన్ని రూ.55 వేలుగా నిర్ణయించి, అదే నిష్పత్తిలో అన్ని క్యాడర్లకు వర్తింపజేయాలని, 50 శాతం దాటిన కరువు భత్యాన్ని మూల వేతనంలో కలపాలని, నిలిపివేసిన 18 నెలల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. విలేకరుల ప్రశ్నలకు సమాధానంగా మాట్లాడుతూ, ప్రైవేటీకరణ, సరళీకరణ పేరుతో రైల్వేలను ప్రైవేటుపరం చేయవద్దని హెచ్చరించారు. అలా చేస్తే మరో ఇండిగో తరహా పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. వందే భారత్‌రైళ్లలో టికెట్‌ధరలు అధికంగా ఉండటంతో సామాన్యులు ప్రయాణించలేకపోతున్నారని పేర్కొన్నారు. కార్మిక సంఘాల అభిప్రాయాలు తీసుకోకుండా కొత్త కార్మిక చట్టాలు అమలు చేయడంతో కార్మికులు హక్కులు కోల్పోతున్నారని విమర్శించారు. 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో 1,617 లక్షల టన్నుల సరుకు రవాణా లక్ష్యాన్ని సాధించడం ఉద్యోగుల అంకితభావం వల్లే సాధ్యమైందన్నారు. 19 వేల కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్లు నిర్మించినా, అదే నిష్పత్తిలో ఉద్యోగ నియామకాలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలాసోర్‌వంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా భద్రతా విభాగాల్లో ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలని సూచించారు. అమృత్‌భారత్, సుందరీకరణ, ఆధునికీకరణ పేరుతో జరుగుతున్న వృథా ఖర్చును తగ్గించాలని కోరారు. లీజు ఛార్జీలుగా రూ.34 వేల కోట్లు, ఏటా రూ.16 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. ఆ నిధులను రైలు పట్టాల పటిష్టతకు వినియోగించి రైళ్ల వేగం పెంచాలని సూచించారు. స్టేషన్లపై విపరీత ఖర్చులు చేసి జపాన్‌సాంకేతికతతో బుల్లెట్‌రైళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందేనని వ్యాఖ్యానించారు.

**విజయవాడలో జనరల్ కౌన్సిల్ సమావేశాలు:**

విజయవాడలో ఈ నెల 17, 18 తేదీల్లో ఎంప్లాయిస్ సంఘ్ జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘసభ్యులతో చర్చించి మరిన్ని నిర్ణయాలు తీసుకుని రైల్వే ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పారు.ఈ సమావేశంలో ఎంప్లాయిస్‌సంఘ్‌అధ్యక్షుడు ఎ. ప్రభాకర్, సంయుక్త ప్రధాన కార్యదర్శి భరణీ భానుప్రసాద్, మీడియా ఇంచార్జీ షేక్‌రవూఫ్‌తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులు ఉపసర్పంచ్‌లు వార్డు సభ్యులను అభినందించి సత్కరించిన ఎమ్మెల్యే





**జగిత్యాల డిసెంబర్ 15 (ప్రజా మంటలు) :** జగిత్యాల పట్టణ పొన్నాల గార్డెన్స్ లో జగిత్యాల నియోజకవర్గం లో ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ బలపరిచిన 70 మంది సర్పంచులు మరియు ఉప సర్పంచ్ లు వార్డు సభ్యులు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందగా 65 మంది గ్రామ పంచాయతీ సర్పంచ్ ,ఉప సర్పంచ్ పాలకవర్గ సభ్యులను శాలువాతో సత్కరించి అభినందించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను నమ్మి అభివృద్ధి నీ కాంక్షించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం రేషన్ కార్డులు ఉచిత కరెంట్ ఉచిత బస్సు ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది.తెలంగాణ రాష్ట్రంలో పండగలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుంది.ప్రతి పక్షాలు అసత్య ఆరోపణలు చేసిన జగిత్యాల ప్రజలు అభివృద్ధి వైపు నిలిచారు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులను భారీ మెజారిటీలతో గెలిపించారన్నారు.తనపై నమ్మకం తో తాను బలపరిచిన 70 మంది సర్పంచులు వారి పాలకవర్గ సభ్యులు నాతో కలిసి నడవడానికి ముందుకు వచ్చారు వారికి నా శుభాకాంక్షలు.తెలంగాణ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి కి ప్రభుత్వం కృషి చేస్తుంది.కాంగ్రెస్ ప్రభుత్వ మద్దతుతో గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలు ఆలోచన చేస్తున్నారని అందులో భాగంగానే కాంగ్రెస్ మద్దతుదారుల గెలుపే సాక్ష్యం అని అన్నారు.గిరిజన గ్రామాలు తండా లకు నిధుల కోసం జిల్లా మంత్రిని కోరడం జరిగింది.తెలంగాణ రాష్ట్ర సాధనలో గొప్ప పాత్ర పోషించిన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే. ముఖ్య మంత్రి ,జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సహకారం తో జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు,మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం అడువాల జ్యోతి లక్ష్మణ్,మోర హనుమండ్లు, పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి,మండల నాయకులు రవీందర్ రావు,కోల శ్రీనివాస్,బాల ముకుందం, నక్కల రవీందర్ రెడ్డి,మహిపాల్ రెడ్డి,సురేందర్ రావు,రౌతు గంగాధర్,గోడిసెల గంగాధర్,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డేంజర్ పాయింట్ను పరిశీలించిన అధికారులు

### ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలకు ఆదేశం

**సికింద్రాబాద్, డిసెంబర్ 15 ( ప్రజామంటలు) :** లాలాపేట ఇసుకబావి సమీపంలో ఈ నెల 7న జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని చిలకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి, లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జగన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు డీఈ మాధవి, ఏఈ వేణు కలిసి సోమవారం పరిశీలించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే.భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నివారణ చర్యలపై అధికారులు చర్చించి పలు సూచనలు చేశారు. రోడ్డు కనబడకుండా అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని, మౌలాలి బ్రిడ్జి వైపు నుంచి వేగంగా వచ్చే వాహనాల నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న డివైడర్లు ప్రమాదకరంగా ఉన్నాయని గుర్తించి, వాటిని తొలగించి నూతనంగా సురక్షిత డివైడర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే కూడలిలో సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.ప్రమాదం జరిగిన ప్రాంతంలో రోడ్డు పక్కన ఇసుక లారీలు, టిప్పర్లు అక్రమంగా పార్కింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన అధికారులు, అట్టి వాహనాలను అక్కడి నుంచి తొలగించాలని సూచించారు. రోడ్డు భద్రతకు సంబంధించి అవసరమైన అన్ని చర్యలను తక్షణమే చేపట్టాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.



# టియుజేఏసి ఉద్యమకారుల అరెస్ట్ అప్రజాస్వామికం

### ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి డిమాండ్





**హైదరాబాద్ డిసెంబర్ 15 (ప్రజా మంటలు) :** ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని తెలంగాణలో ఆవిష్కరించడాన్ని తీవ్రంగా నిరసిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో, శాంతియుతంగా హైదరాబాద్ టాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆందోళన నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్(టియుజేఏసి) కమిటీ నాయకులను, కార్యకర్తలను అక్రమ అరెస్టుకు గురిచేయడం అప్రజాస్వామిక చర్య అని ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కన్వీనర్ షేక్ షావలి సోమవారం రోజు పంపిన పత్రిక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. 2025, డిసెంబర్-15 న టియుజేఏసి రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ కార్మిక, మహిళా, కవులు, కళాకారులు, విద్యార్థులు, మేధావులు పెద్ద ఎత్తున సోమవారం రోజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కాంగ్రెస్ ప్రభుత్వం రవీంద్ర భారతిలో చేపట్టబోతున్న బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఆవిష్కరణను వెంటనే విరమించుకొని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వారిపై ప్రభుత్వ పోలీసులు అనుసరించిన చర్యలు తెలంగాణ ఉద్యమ కారుల సహనాన్ని రెచ్చగొట్టడమేనని షేక్ షావలి గుర్తుచేశారు. కొట్లాడి తెచ్చిన తెలంగాణలో తెలంగాణ కీర్తి, ఖ్యాతిని విస్తరింప చేసిన ఎందరో సిని ప్రముఖులు ఉన్నారని, వారిని విస్మరించి, తెలంగాణ పాటను పాడడానికి అంగీకరించని వ్యక్తి యొక్క విగ్రహాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయడం, తెలంగాణ ప్రజలకే అవమానం అని అంటున్న ఉద్యమ కారుల ప్రతిపాదనను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తిరస్కరించడం సరైనది కాదని అన్నారు. ఎందరో ఆత్మ బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో తెలంగాణ వ్యతిరేకుల విగ్రహాల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న టియుజేఏసి ఉద్యమ కారుల డిమాండ్ ను ప్రజాస్వామికంగా ఆలోచించేలా చూడాలని కోరారు. బీఆర్ఎస్ ను కాదని, కాంగ్రెస్ కు అధికారాన్ని కట్టబెట్టడమే గాకుండా, ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బహిరంగ మద్దతు తెల్పిన టియుజేఏసి శ్రేణులపై పోలీసు నిర్బంధాలు తగవని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి షేక్ షావలి సూచించారు.

# వావ్...దంపతులిద్దరూ గెలిచారు ఇద్దరికీ సమానంగా ఓట్లు వచ్చాయి



**సికింద్రాబాద్, డిసెంబర్ 15 (ప్రజా మంటలు) :** పంచాయతీ ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రామన్నపేట గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోచమ్మల ప్రవీణ్(8వ వార్డు) మంజుల (10వ వార్డు) దంపతులు ఇద్దరు వేర్వేరు వార్డుల్లో పోటీ చేశారు. చిత్రం ఏమిటంటే ఇద్దరికి 98-98 ఓట్లు చొప్పున వచ్చాయి. కాగా ప్రవీణ్ రామన్నపేట ఉప సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని బీఆర్ఎస్ పార్టీ బలపరిచింది. కాగా పంచాయతీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ప్రవీణ్, మంజుల దంపతులను పలువురు అభినందించారు.

# పాషం భాస్కర్ మృతిపై జి. రాజేశం గౌడ్ సంతాపం



**ఇబ్రహీంపట్నం డిసెంబర్ 15 (ప్రజా మంటలు) :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన మాజీ సర్పంచ్, మండల అధ్యక్షుడిగా సేవలందించిన పాషం భాస్కర్ గారు అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన అకాల మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటుగా మారింది.ఈ సందర్భంగా మాజీ మంత్రి జి. రాజేశం గౌడ్ తన భార్య శ్యామలాదేవితో కలిసి పాషం లక్ష్మీపతి గౌడ్ గారి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. భాస్కర్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి దేవుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు.

# రెండేళ్లలో గ్రామాలకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు

### రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే...గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం..- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**గొల్లపల్లి డిసెంబర్ 15 ప్రజా మంటలు (అంకం భూమయ్య)ప్రతినిధి :** గొల్లపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రచారం నిర్వహించారు.బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ఆవుల జమున సత్యం (ఉంగరం గుర్తు) ఓటు వేసి గెలిపించాలని కోరారు.సత్యం వెనుక బిఆర్ఎస్ పార్టీ, కొప్పుల ఈశ్వర్, కెటిఆర్, కెసీఆర్ ఉన్నారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రజలకు మంచి అవకాశం వచ్చిందని కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలంటున్నారు... కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 2 సంవత్సరాలు పూర్తి అయిన కాంగ్రెస్ పార్టీ తట్టెడు పట్టి కూడా పోయలేదు ఎద్దేవా చేశారు.

# సర్పంచ్ అభ్యర్థి ముస్కు దీప్తి నిశాంత్ రెడ్డి

### పేస్టు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని , మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**గొల్లపల్లి డిసెంబర్ 15 ప్రజా మంటలు ( అంకం భూమయ్య ప్రతినిధి) :** గొల్లపల్లి కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుండి గ్రామపంచాయతీ వరకు ర్యాలీ స్థానిక ఎన్నికల ప్రచార సభలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పాలన మరింత బలోపేతమైందని తెలిపారు ప్రజల నిత్యావసరాలు, జీవన భద్రత దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని అన్నారు ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. మండల సమగ్ర అభివృద్ధి కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ముస్కు దీప్తి నిశాంత్ రెడ్డి నీ పేస్ట్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మహిళలు యువకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# గాంధీ మెడికల్ కాలేజీ మాజీ హెచ్ఓడి డా.రత్నకుమారి కన్నుమూత



**సికింద్రాబాద్, డిసెంబర్ 15 ( ప్రజామంటలు) :** సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ బయోకెమిస్ట్రీ విభాగం మాజీ హెచ్ఓడీ డా. జి. రత్నకుమారి సోమవారం కన్నుమూశారు. గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థినిగా, అదే కళాశాలలో సేవలందించి పదవీ విరమణ పొందారు. నిబద్ధత గల అధ్యాపకురాలిగా పేరు పొందారు ఆమె గతంలో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు ఆమె డెడ్ బాడీని వైద్య పరిశోధనలకై అనాటమీ విభాగానికి కుటుంబ సభ్యులు మంగళవారం బాడీ డొనేట్ చేయనున్నారు. ఆమె మృతి వైద్య విద్యావర్గాలకు తీరని లోటని గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. వాణి అన్నారు.

# చౌలామద్దిలో ఓటు హక్కు వినియోగించిన తుల ఉమ, డా. తుల రాజేందర్



**చౌలామద్ది డిసెంబర్ 15 (ప్రజా మంటలు) :** 3వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా చౌలామద్ది గ్రామంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తుల ఉమ, తుల గంగవ్వ స్మారక ట్రస్ట్ చైర్మన్ డా. తుల రాజేందర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని పేర్కొన్న వారు, ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధి, స్వచ్ఛమైన పరిపాలన కోసం సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం ఎంతో అవసరమని తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని, ప్రజలు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొంటున్నారని వారు వెల్లడించారు.

# కైలాసగిరిపై రెస్టారెంట్లకు అనుమతి

**పర్యావరణవేత్తల ఆందోళన**

**వివాదాస్పదంగా కైలాసగిరిలో రెస్టారెంట్లకు అనుమతుల వ్యవహారం**

**సీఆర్‌జెడ్ నిబంధనలను అతిక్రమిస్తున్నారంటున్న పర్యావరణవేత్తలు**



కూటమి ప్రభుత్వం టూరిజం రంగానికి పెద్దపీట వేస్తోంది. రాష్ట్రంలో పెద్దఎత్తున పర్యాటక ప్రాజెక్టులు చేపడుతోంది. పర్యాటక వనరులైన సముద్ర తీరాలు, అటవీ ప్రాంతం, కొండ ప్రాంతాలు, నదీ తీరాలు, ప్రసిద్ధిగాంచిన ఆలయాల దగ్గర నుంచీ పురాతమైన కట్టడాల వరకు సహజ సిద్ధంగా ఏర్పడిన ప్రకృతి వింతలున్న ప్రాంతాలతో పాటు వేర్వేరు చోట్ల విభిన్నమైన వాటికి మరింత గుర్తింపు తెచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలోనే విశాఖ పర్యాటకంలో కైలాసగిరి కీలకపాత్ర పోషించేందుకు పొడవైన గాజు వంతెన నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాతకంగా చేపట్టింది. పర్యాకులకు సరికొత్త అనుభూతి ఇచ్చే విధంగా దీన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. కైలాసగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన గాజు వంతెన డిసెంబరు 1వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. మరోవైపు కైలాసగిరిపై భారం పడుతోంది. ఇప్పటికే 55కిపైగా దుకాణాలతో కిక్కిరిసిపోయింది. టాయ్ ట్రైన్, స్కై సైక్లింగ్, జిప్ లైనర్, గాజు వంతెనలు ఉన్నాయి. మరో వైపు సింగపూర్ సంస్థతో ప్రత్యేక ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా కాటేజీలు, భారీ రెస్టారెంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. ఇలాంటి కట్టడాలను చేపట్టకూడదని గతంలో హైకోర్టు ఆదేశాలున్నాయి. దాంతో తీర ప్రాంత క్రమబద్ధీకరణ (సీఆర్‌జెడ్) నిబంధనలను అతిక్రమిస్తున్నారని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో వీఎంఆర్‌డీఏ కైలాసగిరిపై ఎకో హైట్స్ కాటేజీలు, 360 డిగ్రీల రివాల్వింగ్ ఫైన్ డైన్ రెస్టారెంట్, బే వ్యూ కేఫ్‌ల ప్రాజెక్టును ప్రతిపాదించారు. దీన్ని ఓ వైఎస్సార్సీపీ నేతకు 33 ఏళ్ల లీజుకు కట్టబెట్టాలని చూశారు. కానీ ఈ ప్రతిపాదనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆ ప్రాజెక్టు నిలిచిపోయింది. అప్పట్లో పిలిచిన టెండర్లను ఇటీవల కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పుడు అదే ప్రాజెక్టును మళ్లీ పట్టాలపైకి తీసుకురావాలని నిర్ణయించడంపై పలు విమర్శలు వస్తున్నాయి. నేచర్ కాటేజీలు 20 గదులను నిర్మిస్తారు. దీనికితోడు ఈత కొలను, సమావేశ మందిరం, పార్టీ హాలు, భోజనశాల సైతం ఉంటాయి. ఒకేసారి వంద మంది కూర్చొని తినేలా రివాల్వింగ్ రెస్టారెంట్‌ను నిర్మిస్తారు. అంతేకాకుండా 60 మంది కూర్చునేలా బీచ్ వ్యూకేఫ్‌ను సైతం నిర్మిస్తారు. కైలాసగిరిపై భారీ ప్రాజెక్టులు చేపట్టడం సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధమని అందుకే గతంలో హైకోర్టు కూడా తన తీర్పును వెలువరించింది. దీనికి సంబంధించి గతంలో ఇక్కడ నేచర్ కాటేజీలు, రివాల్వింగ్ రెస్టారెంట్? నిర్మాణాలను చేపట్టగా పర్యావరణవేత్తలు న్యాయస్థానంలో పోరాటం చేశారు. దాంతో వెంటనే నిర్మాణాలను ఆపేయాలని న్యాయస్థానం తక్షణం ఆదేశాలిచ్చింది. దీంతో ఆయా నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. అయినా సరే కూటమి ప్రభుత్వం పట్టించుకోకుండా కొత్త ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లడం గమనార్హం. గత ప్రభుత్వంలో అభివృద్ధి పనుల పేరుతోన కైలాసగిరి కొండపై విధ్వంసానికి పాల్పడ్డారు. ఫలితంగా వందలాది వృక్షాలను తొలగించారు. ప్రాజెక్టు విస్తీర్ణం 1.99 ఎకరాలుగా ఉంది. అంచనా విలువ రూ.20 కోట్లు వరకూ ఉంది. నిర్మాణానికి సంబంధించిన గడువు 18 నెలలుగా అధికారులు నిర్దేశించారు. ఇదిలావుంటే కైలాసగిరిపై భారీ ప్రాజెక్టులు, రెస్టారెంట్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి.

# ట్రెండింగ్ మైక్రో గ్రీన్స్

**ఇంట్లోనే పండించి పచ్చిగా తింటూ ఆరోగ్యంగా**

**నగర ఫుడ్ కల్చర్ ట్రెండింగ్ అవుతున్న మైక్రో గ్రీన్స్**

**ఆసక్తి చూపుతున్న ప్రజలు**

**ఇంటి బాల్కనీ, పెరడు, గోడలపై పెంపకం**



ప్రస్తుతం ఎటు చూసినా కాలుష్యం, విషతుల్యమైన ఆహారం. ఫలితంగా ప్రాణాంతక వ్యాధులు తలెత్తున్నాయి. దీంతో చాలా మందిలో ఆరోగ్య స్పృహ పెరిగింది. ఒకప్పుడు ఆహ్లాదం, పచ్చదనం కోసం ఇంటిపై, వరండాలో మొక్కలు పెంచేవారు. ఇప్పుడు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల, సేంద్రియ ఎరువులతో ఇంట్లోనే ఆకుకూరలు, కూరగాయలు మొక్కలు వేసి పండించి వంటలకు వాడుకుంటున్నారు. అయితే, చాలామందికి ఇవి ఎలా చేసుకోవాలో తెలియదు. మనిషి ఆరోగ్యానికి పోషకాల అవసరం ఎంతో ఉంటుందన్న విషయం తెలిసిందే. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణ ధాన్యాలల్లో మాత్రమే మన శరీరానికి కావాల్సిన పోషకాలు లభిస్తాయి. అయితే పనిభారం, ఒత్తిడి, సమయాభావంతో ఎంతో మంది వీటిపై శ్రద్ధ చూపడం లేదు. ఈ తరుణంలో ఇంట్లోనే పోషకాలు ఉండే వాటిని పెంచుకుని చక్కగా తినవచ్చు. ప్రస్తుతం మిద్దె సాగు ట్రెండ్ అవుతున్న విషయం తెలిసిందే. అయితే దీనితో పాటు మైక్రో గ్రీన్స్ నగర ఫుడ్ కల్చర్‌లో కూడా ట్రెండింగ్ అవుతుంది. వారం నుంచి 10 రోజుల వ్యవధిలో 3 అంగుళాల మేర పెరిగే ఆకుకూరలు, కాయగూరలను మైక్రో గ్రీన్స్ అని పిలుస్తారు. ఇళ్లల్లో సులభంగా, తక్కువ ఖర్చుతో పెంచుకోవచ్చు. అందుకే నగర ప్రజలు దీనిపై ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంటి బాల్కనీ, పెరడు, గోడలపై ఈ మైక్రో గ్రీన్స్ పండించొచ్చు. మట్టి, కోకో పిట్, వర్మీ కంపోస్టు తగిన మోతాదులో వేసి విత్తనాలు నాటితే సరిపోతుంది. రోజుకు 3 నుంచి 4 గంటలు ఎండలో ఉంచి తర్వాత ఇంట్లో పెట్టుకోవాలి. ట్రేలు, ప్లాస్టిక్ డబ్బాలు, ఖాళీ సీసాలు, కుండలు, ప్లాస్టిక్, వస్త్ర సంచులు, చిన్నపాటి తొట్టెల్లో పెంచొచ్చు. వారం నుంచి 2 వారాల్లోపు పంటను కోసుకోవాలి. తోటకూర, ముల్లంగి, కొత్తిమీర, పాలకూర, బచ్చలి, బ్రకోలి, పుదీనా, నువ్వులు, పెసలు, వేరుశనగ, ఆవాలు, క్యారెట్, బీట్‌రూట్, కాలీఫ్లవర్, క్యాబేజి, ఉల్లి, వెల్లుల్లి, సన్‌ఫ్లవర్ తదితర విత్తనాలు నాటుకోవచ్చు. అవి మొలకెత్తి 3 అంగుళాలు పెరిగాక వేళ్లను కత్తిరించి ఆహారంగా తీసుకోవచ్చు. స్నేహితుల ఇళ్లల్లో మైక్రో గ్రీన్స్ పెంచడాన్ని చూసి ఆసక్తి కలిగిందని అందువల్ల మైక్రో గ్రీన్స్‌పై అవగాహన కల్పిస్తున్నానని విశాఖకు చెందిన సింధూరి చెప్తున్నారు. ఇంట్లోని ఖాళీ ప్రదేశాల్లో, ఆరు బయట, గోడలపై కొబ్బరి చిప్పలు, చిన్న డబ్బాల్లో 3 ఏళ్లుగా పెంచుతున్నానని అన్నారు. ఇంటి అవసరాలకే కాకుండా ఎవరైనా కావాలని అడిగితే ఇస్తున్నానని ఇంకా నగరంలో జరిగే ప్రదర్శనల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి అందరికీ అవగాహన కల్పిస్తున్నానని సింధూరి అన్నారు. మైక్రో గ్రీన్స్ పెంచడం చాలా తేలిక. ఉడికించకుండా తింటే పోషకాలు నేరుగా అందుతాయని ఏయూ ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం. రాజేశ్వరి తెలిపారు. ఇవి వ్యాధి నిరోధకశక్తిని పెంపొందిస్తాయని వీటిలో విటమిన్ సి, ఇ, ఎ, కె, బీ3, బీ6, బీ12, పీచుపదార్థం, క్లోరోఫిల్ ఉంటుందని అన్నారు. ఏయూలో ప్రయోగాత్మకంగా పండించిన మైక్రోగ్రీన్స్‌లో 60 ఎంజీ పోషకాలుంటే సాధారణంగా పండించిన వాటిల్లో సగానికన్నా తక్కువ ఉన్నాయని ట్రేల పరిమాణం ఆధారంగా విత్తనాలు చల్లుకోవాలని రాజేశ్వరి తెలిపారు.

# అంతర్జాతీయ క్రికెట్ పిచ్‌లో కీలకం

**అమలాపురం 'బ్లాక్ కాటన్' సాయిల్‌కు ఫుల్ డిమాండ్**

**పిచ్‌ల తయారీలో కోనసీమ మ్యాజిక్**

**పదేళ్లుగా ఇదే వినియోగం**

**పగుళ్లు రావు, వర్షం వచ్చినా భయం లేదు**



క్రికెట్ మైదానంలో బౌండరీల మోత మోగాలన్నా, వికెట్ల పతనం సాగాలన్నా, అక్కడ పిచ్ కీలక పాత్ర పోషిస్తుంది. బ్యాటర్ల గెలుపు, బౌలర్ల ఓటములను నిర్ణయించేది ఆ 22 గజాల స్థలమే. అయితే మన దేశంలోని ప్రముఖ అంతర్జాతీయ స్టేడియాల్లో తయారయ్యే పిచ్‌లకు మన తెలుగు మట్టే ప్రాణం పోస్తోందన్న విషయం చాలామందికి తెలియదు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం మట్టికి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ఫుల్ డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి వెళ్లే 'బ్లాక్ కాటన్' మట్టితోనే పలు స్టేడియాల్లో పిచ్‌లను తీర్చిదిద్దుతున్నారు. అమలాపురం నుంచి అంతర్జాతీయ స్టేడియాలకు: సాధారణంగా కొబ్బరి చెట్లకు, పచ్చని ప్రకృతికి కోనసీమ పెట్టింది పేరు. కానీ ఇప్పుడు క్రికెట్ పిచ్‌లకు కూడా కేరాఫ్ అడ్రస్‌గా మారింది. విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ మైదానంలో గత పదేళ్లుగా ఈ మట్టినే వాడుతున్నారు. కేవలం మన రాష్ట్రమే కాదు, పొరుగున ఉన్న తమిళనాడులోని చెన్నై (ఎంఏ చిదంబరం/చపాక్), కర్ణాటకలోని బెంగళూరు (చిన్నస్వామి) స్టేడియాలకు కూడా ఇక్కడి నుంచే మట్టి ఎగుమతి అవుతోంది. అమలాపురంలోని ఓ రైతుకు చెందిన కొబ్బరి తోటలో ఈ ప్రత్యేకమైన మట్టిని సేకరిస్తున్నారు. ల్యాబ్ టెస్టుల్లో 'పాస్': ఏదో సాధారణ మట్టిని తీసుకెళ్లి పిచ్‌లకు వాడరు. దీని వెనుక పెద్ద ప్రాసెస్ ఉంది. అమలాపురం కొబ్బరి తోటల్లో దొరికే మట్టిని సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు చేయించారు. క్యూరేటర్లు, నిపుణులు దీనిని క్షుణ్ణంగా పరిశీలించారు. పిచ్‌ల తయారీకి ఇది అత్యంత అనుకూలమని తేల్చారు. అప్పటి నుంచి లారీల్లో ఈ మట్టిని తరలిస్తున్నారు. ఈ 'బ్లాక్ కాటన్' మట్టికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. అందుకే క్యూరేటర్లు దీనికి ఓటేస్తున్నారు. ఇందులో బంక మట్టి, ఒండ్రు మట్టితో పాటు ఇసుక రేణువులు సరైన పాళ్లలో ఉంటాయి. ఇలా సేకరించిన మట్టిని యంత్రాలతో మూడు సార్లు జల్లెడ పడతారు. ఆ తర్వాతే పిచ్ తయారీకి వాడతారు. ఈ మట్టితో చేసిన పిచ్‌లకు బీటలు వారే తత్వం చాలా తక్కువ. అంటే పిచ్ త్వరగా పగిలిపోదు. ఐదు రోజుల టెస్ట్ మ్యాచ్‌లకు ఇది చాలా ముఖ్యం. క్రికెట్ మ్యాచ్‌లకు ప్రధాన శత్రువు వర్షం. కానీ ఈ మట్టి ఆ సమస్యను కొంతవరకు తగ్గిస్తుంది. దీనికి నీటిని పీల్చుకునే స్వభావం చాలా ఎక్కువ. వర్షం పడినా పిచ్ త్వరగా ఆరిపోతుంది. దీంతో మ్యాచ్‌ను త్వరగా పునరుద్ధరించవచ్చు. అలాగే ఎండ తీవ్రతను, వేడిని గ్రహించడంలోనూ ఇది అద్భుతంగా పని చేస్తుంది. బౌన్స్, స్పిన్‌కు కూడా ఈ మట్టి బాగా సహకరిస్తుందని క్యూరేటర్లు చెబుతున్నారు. కోనసీమ కొబ్బరి బొండాలే కాదు, అక్కడి మట్టి కూడా ఎంతో మధురమని, క్రికెట్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోందని ఈ సంఘటన నిరూపిస్తోంది.

# వారిని విధి ఓడించినా ఓటర్లు ఆదరించారు

**మరణించిన అభ్యర్థులను వరించిన విజయం**

**తెలంగాణలో ముగిసిన రెండో విడత పంచాయతీ ఎన్నికలు**

**పలు జిల్లాల్లో మరణించిన అభ్యర్థుల గెలుపు**

**గెలిచిన అభ్యర్థులు మరణించిన చోట్ల తిరిగి ఎన్నిక నిర్వహిస్తామని అధికారుల వెల్లడి**



రాష్ట్రంలో రెండో విడత పంచాయతీ ఎన్నికలు ఆదివారంతో ముగిశాయి. ఆ రోజునే ఫలితాలూ వెల్లడించారు. అయితే పలుచోట్ల మరణించిన అభ్యర్థులను విజయం వరించింది. వారిని విధి ఓడించినా ఓటర్లు మాత్రం గెలిపించారు. ఏయే జిల్లాల్లో ఇలాంటి ఘటనలు జరిగాయి? ఆ వివరాలేంటో తెలుసుకుందాం. విధి ఓడించినా ప్రజలు గెలిపించారు : రంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లి మండలంలోని మాసానిగూడ గ్రామంలో 8వ వార్డు సభ్యురాలుగా పల్లె లత(42) తన సమీప ప్రత్యర్థిపై 30 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. వాస్తవానికి ఈ నెల 7వ తేదీన మాసానిగూడ అనుబంధ గ్రామమైన మంచర్లగూడెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న క్రమంలో ఆమెకు ఛాతీలో నొప్పి వచ్చింది. దీంతో ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. అయినప్పటికీ లతను ఓటర్లు మాత్రం ఆదరించడం గమనార్హం. ఇదిలా ఉండగా ఈ వార్డు స్థానానికి మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసి, ఎన్నిక నిర్వహిస్తామని ఎంపీడీఓ వెంకయ్య వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలోని రాయికోడ్ మండలం పీపడ్‌పల్లిలో నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మరణించిన అభ్యర్థినే గెలుపు వరించింది. ఆర్థిక ఇబ్బందులతో పాటు సొంత పార్టీ వాళ్లే మోసం చేస్తున్నారనే ఆందోళనతో ఈ నెల 8న సర్పంచి అభ్యర్థి చాల్కి రాజు బలవన్మరణానికి పాల్పడ్డారు. అప్పటికే నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్తయింది. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో రాజు 9 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం గమనార్హం. పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యుడిగా గెలిచిన వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన పెద్దపల్లి జిల్లాలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పందిల్లకు చెందిన రేవెల్లి రాజ్‌కుమార్(35) తొలివిడత జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 8వ వార్డు సభ్యుడిగా గెలుపొందారు. ఆయన గతేడాదిగా హైదరాబాద్ నగరంలో నివసిస్తున్నారు. ఓట్ల కోసం గ్రామానికి వచ్చిన ఆయన కుటుంబ సభ్యులు అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయారు. రాజ్‌కుమార్ ఆదివారం గ్రామంలో మిత్రులతో కలిసి మద్యం సేవించినట్లుగా సమాచారం. సాయంత్రానికి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతిపై గ్రామస్థులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఆదివారంతో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. 3,911 పంచాయతీలు, 29,917 వార్డులకు మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ప్రక్రియ? కొనసాగింది. తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఉదయం 9 గంటల వరకు 22.54 శాతం పోలింగ్? నమోదవ్వగా, మధ్యాహ్నం 1 గంటకు పూర్తిస్థాయి ఓటింగ్? 80.84 శాతంగా నమోదైంది. అక్కడక్కడ చెదురుమదరు ఘటనలు మినహా అన్నిచోట్ల ఓటింగ్? ప్రశాంతంగా జరిగింది. వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల తీరును అధికారులు పర్యవేక్షించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. మరోవైపు రెండో దశలో 4,333 గ్రామ పంచాయతీ సర్పంచి, 38,350 వార్డు సభ్యుల పదవుల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్? వెలువడింది. వీటిలో 415 గ్రామ సర్పంచి, 8307 వార్డు పదవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో 5 గ్రామాలు, 108 వార్డుల్లో మాత్రం నామినేషన్లు దాఖలు కాలేదు. మిగతా వాటిలో 415 మంది సర్పంచ్?లు, 8,307 వార్డు మెంబర్లు ఏకగ్రీవమయ్యాయి. రెండు గ్రామ పంచాయతీలు, 18 వార్డుల్లో కోర్టు స్టే కారణంగా ఎన్నికలు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీల్లో సర్పంచి పదవులకు నామినేషన్లు దాఖలు కాని 5 గ్రామాల్లో రెండు నల్గొండ జిల్లాలో ఉండగా భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా, వరంగల్, మంచిర్యాల జిల్లాల్లో ఒకటి చొప్పున ఉన్నట్లు అధికారులు వివరించారు. రెండు సర్పంచి స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని ఈసీ వివరించింది.

# ఆ ఒక్క ఫోన్‌కాల్‌తో రూ.కోట్లతో నష్టం

**ప్రయాణికులకు గంటల కొద్దీ కష్టం**

**శంషాబాద్ విమానాశ్రయానికి నకిలీ బాంబు హెచ్చరికలు**

**విమానయాన సంస్థలకు నష్టం, ప్రయాణికులకు కష్టం**

**ఏడాదిలోనే శంషాబాద్ విమానాశ్రయానికి 100కు పైగా బెదిరింపులు**



తరచూ బాంబు బెదిరింపులతో శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఉలిక్కిపడుతోంది. గతంలో అరుదుగా వచ్చే నకిలీ బాంబు హెచ్చరికలు, ఇప్పుడు నిత్యకృత్యమవుతున్నాయి. మానసిక సమస్యలతో పాటు వ్యక్తిగత కారణాలతోనూ దుండగులు బెదిరింపులకు దిగుతున్నట్లుగా తెలుస్తోంది. గంటల తరబడి తనిఖీలు నిర్వహించాక, బూటకమని తేలడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నకిలీ ఫోన్ కాల్స్ వల్ల విమానయాన సంస్థలు ఏటా రూ.కోట్లలో నష్టపోతున్నాయి. ఈ ఏడాది శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 100కు పైగా బెదిరింపులు వచ్చాయంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. నకిలీ బాంబు హెచ్చరికల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వారి విలువైన సమయం వృథా అవుతోంది.

**క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే :**

దేశంలో ఎయిర్‌పోర్టులు, విమానాలకు బాంబు బెదిరింపుల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) కొన్ని ప్రమాణాలతో బీటీసీపీ (బాంబ్ థ్రెట్ కంటిన్జెన్సీ ప్లాన్)ను సూచించింది. ప్రతి ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్, పోలీసులు, ఎయిర్‌లైన్స్ సంస్థ ప్రతినిధులతో బాంబు ముప్పు అంచనా కమిటీ అనేది ఉంటుంది. ఇది బెదిరింపులను విశ్లేషించిన అనంతరం అవసరమైతే చర్యలు చేపడుతుంది. సాధారణంగా బెదిరింపులను రెండు భాగాలుగా విభజిస్తారు. దుండగులు విమానం నంబరుతో సహా చెప్పి బెదిరించడాన్ని ఒక కేటగిరీగా, అస్పష్టంగా ఉంటే మరో కేటగిరీ కింద పరిగణిస్తారు.

**ప్రయాణికులకు నరకం :**

ఇలాంటి నకిలీ బాంబు బెదిరింపుల వల్ల కొన్నిసార్లు ఒక ప్రాంతానికి వెళ్లాల్సిన విమానం ఇంకో ప్రాంతానికి తీసుకెళ్తుంటారు. ప్రయాణికులు నిర్దేశిత సమయానికి గమ్యస్థానాలకు చేరలేని పరిస్థితి ఏర్పడుతోంది. డిసెంబరు 2వ తేదీన కువైట్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది విమానాన్ని ముంబయిలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించారు. ఈ తనిఖీలు చేపట్టే సమయంలో ప్రయాణికుల్ని ఎక్కడికి వెళ్లనివ్వరు. చిన్న పిల్లలున్న తల్లిదండ్రులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఎయిర్‌పోర్టులో బాంబు ఉన్నట్లు బెదిరింపు కాల్ : హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు కొద్ది రోజుల క్రితం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో బేగంపేట పోలీసులు అప్రమత్తమై చర్యలు చేపట్టారు. వెంటనే బాంబు డాగ్ స్క్వాడ్‌తో విమానాశ్రయంలో తనిఖీలను చేపట్టారు. గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌కాల్, ఈ మెయిల్ చేసి బాంబు పెట్టినట్లు బెదిరించడంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు హుటాహుటిన విమానాశ్రయానికి చేరుకుని తనిఖీలు చేశారు. చివరకు అది ఉత్తదే అని తెలిసింది.

**వ్యక్తిగత కారణాలతో :**

అధిక శాతం ఘటనల్లో మానసిక సమస్యలు, వ్యక్తిగత కారణాలతో పలువురు నకిలీ బెదిరింపులకు పాల్పడుతున్నట్లుగా పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. ఎయిర్‌పోర్ట్ సిబ్బంది తమతో సరిగా ప్రవర్తించలేదనే కారణంతోనూ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడుతున్నారు. ఇతరుల్ని ఇబ్బంది పెట్టేందుకు వారి సెల్‌ఫోన్ నంబర్లు, మెయిల్స్ ద్వారా మెసేజ్‌లు పంపిస్తున్నారు. విమానం గాల్లో ఉన్నప్పుడు బెదిరింపు వస్తే సమీప ఎయిర్‌పోర్టుకు విమానాన్ని మళ్లించి తనిఖీలు చేస్తారు. ఎయిర్‌పోర్టులకు నకిలీ బెదిరింపు హెచ్చరికలు చేసేవారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే కొంతవరకు ఇలాంటి ఘటనలు జరగకుండా నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# జీహెచ్ఎంసీ డివిజన్ల పెంపు -హైకోర్టులో పిటిషన్

**హైకోర్టుకు చేరిన జీహెచ్ఎంసీ డివిజన్ల పెంపు వ్యవహారం**

**డివిజన్ల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేసిన వినయ్‌కుమార్**

**జీహెచ్ఎంసీ వద్ద బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన**




జీహెచ్ఎంసీలోని డివిజన్ల పెంపును సవాల్ చేస్తూ వినయ్ కుమార్ అనే వ్యక్తి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని న్యాయస్థానాన్ని కోరారు. జస్టిస్ బి. విజయ్ సేన్ రెడ్డి ఈ పిటిషన్?పై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ల పునర్విభజనలో అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు. తన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన శాస్త్రీయంగా జరపాలని కాంగ్రెస్ కార్పొరేటర్లు విజ్ఞప్తి చేశారు. డివిజన్ల పునర్విభజనలో తమ అభిప్రాయాలు తీసుకోవాలని కోరిన కాంగ్రెస్ కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కాంగ్రెస్ కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు సమావేశమయ్యారు. డివిజన్ల పురనర్విభజనలో తమ అభిప్రాయాలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ డివిజన్ల సరిహద్దులపై మార్కింగ్ చేసి వినతిపత్రం ఇచ్చామన్న ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ ఏ ప్రాతిపదికన ప్రకారం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

# పొగమంచు ఎఫెక్ట్ .. ప్రధాని మోదీ విదేశీ పర్యటన ఆలస్యం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు దేశాల పర్యటనకు సోమవారం ఉదయం బయలుదేరాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా జాప్యం నెలకొంది. దట్టమైన పొగమంచు దేశ రాజధాని ఢిల్లీని కమ్మేయడంతో ఆయన ప్రయాణించాల్సిన విమానం టేకాఫ్ ఆలస్యమైంది. షెడ్యూల్ ప్రకారం ప్రధాని మోదీ జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల పర్యటన కోసం సోమవారం ఉదయం 8:30 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరాల్సి ఉంది. అయితే విమానాశ్రయంలో వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ప్రధాని పర్యటన ఆలస్యమైనట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఈ పొగమంచు ప్రభావం కేవలం ప్రధాని పర్యటనపైనే కాకుండా ఢిల్లీ విమానాశ్రయంలోని సాధారణ విమాన సర్వీసులపై కూడా తీవ్రంగా పడింది. ఉదయం నుంచి పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని విమానాశ్రయ అధికారులు తెలిపారు. విజిబిలిటీ గణనీయంగా తగ్గడమే ఇందుకు ప్రధాన కారణమని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇండిగో, ఎయిరిండియా వంటి ప్రముఖ విమానయాన సంస్థలు ప్రయాణికులకు ప్రత్యేక సూచనలు జారీ చేశాయి. పలు విమానాలను రద్దు చేస్తున్నామని, మరికొన్ని ఆలస్యంగా నడుస్తాయని ప్రకటించాయి. ప్రయాణికులు తమ విమానాల స్టేటస్‌ను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్లలో చూసుకోవాలని సూచించాయి. ప్రయాణంలో కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలుపుతూ, ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని ఆ సంస్థలు స్పష్టం చేశాయి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com